ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 27-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

ముఖ్యాంశాలు

- సాంకేతిక ఆధారిత పాలనతో దేశం సంస్కరణల దిశగా పయనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.
- భారతదేశ ఐటీ రంగం AI మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.
- తమిళనాడు ఎన్నికల ద్వారా దేశంలో సరికొత్త రికార్డును నెలకొల్పుతామని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తెలిపారు.
- ఐసీసీ టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ లో భాగంగా జరుగుతున్న మ్యాచ్ లో న్యూజిలాండ్ 160 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ ముందు ఉంచింది.

= = = = = = = = = = = = = = = = = = =

సాంకేతిక ఆధారిత పాలనను విస్తరించడం ద్వారా దేశం సంస్కరణల దిశగా పయనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. "టెక్నాలజీ, సంస్కరణలు, ఆర్థిక స్వావలంభనకు వికసిత్ భారత్" అనే అంశంపై ఈరోజు దృశ్య మాధ్యమం ద్వారా జరిగిన బడ్జెట్ అనంతర వెబినార్‌లో ప్రధానమంత్రి ప్రసంగిస్తూ... సంస్కరణల ద్వారా సరళీకృత ప్రక్రియలు, మెరుగైన వ్యాపార నిర్వహణకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కృత్రిమ మేధ, బ్లాక్‌చెయిన్, డేటా అనలిటిక్స్‌లను విస్తృతంగా ఉపయోగించడం ద్వారా పారదర్శకత, వేగం, జవాబుదారీతనం పెంచాలని స్పష్టంచేశారు. గత దశాబ్ద కాలంగా ప్రభుత్వం మౌలిక సదుపాయాలపై ఎక్కువగా దృష్టి పెట్టిందని ప్రధానమంత్రి అన్నారు. రహదారులు, రైల్వేలు, ఓడరేవులు, డిజిటల్ నెట్‌వర్క్, విద్యుత్ వ్యవస్థలు వంటి వాటిని అభివృద్ధి చేయడం ద్వారా దేశ అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామన్నారు. 11 సంవత్సరాల క్రితం బడ్జెట్‌లో మౌలిక సదుపాయాలకి కేవలం రెండు లక్షల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారని, కానీ తాజా కేంద్ర బడ్జెట్‌లో అది 12 లక్షల కోట్ల రూపాయలు దాటిందని ప్రధానమంత్రి వివరిస్తూ...

(వాయిస్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

రాజస్థాన్ జైసల్మేర్‌లోని వైమానిక దళ స్టేషన్‌లో స్వదేశీ తయారీ లైట్ కంబాట్ హెలికాప్టర్ ప్రచండ్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు విహారయాత్ర చేపట్టారు. గ్రూప్ కెప్టెన్ నయన్ శాంతిలాల్ బహువాతో కలిసి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రధాన విమానంలో ప్రయాణించగా, ఎయిర్ స్టాఫ్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్, గ్రూప్ కెప్టెన్ ఎ మహేంద్ర రెండవ విమానంలో ప్రయాణించారు. సుమారు 25 నిమిషాల పాటు వారు గడిసర్ సరస్సు, జైసల్మేర్ కోట మీదుగా ప్రయాణించి ట్యాంక్ టార్గెట్‌పై దాడి చేశారు. ఈ సందర్భంగా భారతదేశం స్వదేశీగా అభివృద్ధి చేసిన తేలికపాటి పోరాట హెలికాప్టర్ ప్రచండ్‌లో ప్రయాణించడం ఒక గొప్ప అనుభవం అని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఈ ప్రయాణాన్ని విజయవంతం చేసినందుకు భారత వైమానిక దళం, జైసల్మేర్ వైమానిక దళ బృందాన్ని రాష్ట్రపతి అభినందించారు. అలాగే జైసల్మేర్‌లోని భారత వైమానిక దళం నిర్వహించే వాయు శక్తి విన్యాసాలను రాష్ట్రపతి వీక్షించారు.

==========

భారతదేశ ఐటీ రంగం కోడింగ్ నుండి ఆటోమేటెడ్ కోడింగ్ కు మారుతున్న నేపథ్యంలో AI మౌలిక సదుపాయాలను నిర్మించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర ఐటీ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పిలుపునిచ్చారు. ఈరోజు న్యూఢిల్లీలో నిర్వహించిన రైజింగ్ భారత్ సమ్మిట్‌లో కేంద్రమంత్రి ప్రసంగిస్తూ... కృత్రిమ మేధ (AI) అమలులో విశ్వసనీయత ఎంతో ముఖ్యమైనదని అన్నారు. వినియోగదారు, ఎంటర్‌ప్రైజ్ రంగంలో భారతదేశం అత్యధిక AI వ్యాప్తిని కలిగి ఉందని తెలిపారు. AI పరివర్తనకు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా బాధ్యత వహించాలన్నారు. దీనిలో భాగంగానే ప్రభుత్వం సుమారు నాలుగు సంవత్సరాల క్రితం ఐటీ పరిశ్రమల భాగస్వామ్యంతో భవిష్యత్ నైపుణ్య కార్యక్రమాన్ని ప్రారంభించిందని అశ్విని వైష్ణవ్ పేర్కొంటూ...

(వాయిస్...30 సెకన్లు)

==========

విరామం

==========

స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆయనకు నివాళులర్పించారు. అన్యాయానికి వ్యతిరేకంగా, దృఢంగా నిలబడాలనే సంకల్పమే నిజమైన శౌర్యమని చంద్రశేఖర్ ఆజాద్ జీవితం బోధిస్తుందని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. దేశాన్ని బానిసత్వ సంకెళ్ల నుండి విముక్తి చేయడానికి చంద్రశేఖర్ ఆజాద్ తన సర్వస్వం త్యాగం చేశారన్నారు. మాతృభూమి కోసం ఆయన చేసిన త్యాగం దేశంలోని ప్రతి తరానికి స్ఫూర్తినిస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ బ్రిటిష్ రాజ్‌కు వ్యతిరేకంగా సాహసోపేతమైన పోరాటం చేశారని, తన చివరి శ్వాస వరకు వందేమాతరం జపించారని అన్నారు. ఆజాద్ త్యాగాల గాథ ప్రతి భారతీయుడిలోనూ దేశభక్తి స్ఫూర్తిని నింపుతూనే ఉంటుందని హోం మంత్రి అమిత్ షా అన్నారు.

==========

తమిళనాడులోని నిర్వహించిన SIR ప్రక్రియ దేశానికి ఒక మోడల్‌గా నిలిచిందని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, ఒకే దశలో ఎన్నికలు నిర్వహించాలని పలు పార్టీలు సూచించాయని తెలిపారు. వారి విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇటీవల కాలంలో ఏమాత్రం పొరపాట్లకు తావీయకుండా బీహార్ ఎన్నికలు జరిగాయని, అంతకు మించి మరింత మెరుగ్గా తమిళనాడులో ఎన్నికలు నిర్వహించి సరికొత్త రికార్డు నెలకొల్పుతామని జ్ఞానేష్ కుమార్ వెల్లడిస్తూ...

(వాయిస్...30 సెకన్లు)

==========

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు రాజస్థాన్‌లోని అజ్మీర్ లో పర్యటిస్తారు. ఈ పర్యటనలో భాగంగా 16 వేల 680 కోట్ల రూపాయల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి ప్రారంభోత్సవ, శంకుస్థాపనలు చేస్తారు. పట్టణాభివృద్ధి, తాగునీటి సరఫరా, రోడ్లు, నీటిపారుదల, ఇంధనం, పారిశ్రామిక మౌలిక సదుపాయాలతో సహా పలు కీలక రంగాలకు చెందిన ప్రాజెక్టులు వీటిలో ఉన్నాయి. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ప్రధానమంత్రి ప్రసంగిస్తారు. అలాగే నిరోధక ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేయడం, మహిళల శ్రేయస్సును పెంపొందించే లక్ష్యంలో భాగంగా ప్రధానమంత్రి 14 సంవత్సరాల వయస్సు గల బాలికలకు హ్యూమన్ పాపిల్లోమావైరస్ (HPV) టీకా కోసం దేశవ్యాప్త ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. మహిళల్లో క్యాన్సర్ సంబంధిత అనారోగ్యానికి ప్రధాన కారణాలలో ఒకటిగా ఉన్న గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడం ఈ ప్రచార ప్రధాన లక్ష్యం.

==========

ఐసీసీ టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ లో భాగంగా శ్రీలంకలోని కొలంబో వేదికగా ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్ 20 ఓవర్లకు 7 వికెట్లు నష్టపోయి, 160 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లాండ్ ముందు ఉంచింది.

==========

న్యాయవ్యవస్థలో అవినీతిపై NCERT పుస్తకంలో ఒక అధ్యాయం ఉండడం దురదృష్టకరమని, ప్రభుత్వం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తోందని కేంద్ర విద్యా శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఈరోజు ఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ, అన్ని పుస్తకాలను ఉపసంహరించుకోవడంతో పాటు రద్దు చేయాలని NCERTని ఆదేశించామని, న్యాయ వ్యవస్థను ధిక్కరించే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని అన్నారు. సుప్రీంకోర్టు ఏది ఆదేశించినా, మంత్రిత్వ శాఖ దానిని పాటిస్తుందన్నారు. NCERT పుస్తకంలో ఇంత బాధ్యతారహితమైన అధ్యాయాన్ని జోడించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ శాఖ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశామన్నారు. న్యాయవ్యవస్థలో అవినీతిపై అధ్యాయం ఉన్న 8వ తరగతి NCERT పుస్తకంపై గతంలో సుప్రీంకోర్టు నిషేధం విధించింది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీగా నష్టాల్లో ముగిశాయి. మిశ్రమ ప్రపంచ సంకేతాల మధ్య రియల్టీ, ఫైనాన్షియల్ సర్వీసెస్ స్టాక్స్ క్షీణించడంతో భారత ఈక్విటీ బెంచ్ మార్క్ సూచీలు గణనీయంగా క్షీణించాయి.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =